సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



మాహే రంజాన్..

శుక్రవారం నెలవంక కనిపించడంతో ముస్లింలు శనివారం రంజాన్ జరుపుకోనున్నారు.

వివరాలు ||లో ▸



బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు ||లో ▸



గరిష్టం/కనిష్టం 37.2 /25.9

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం తేలికపాటి మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

24న రిపోర్ట్ చేయాలి

కందనూలు: ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించబడిన ఉపాధ్యాయులు ఈ నెల 24న తమ మాతృ పాఠశాలల స్థానాలకు వెళ్లి రిపోర్ట్ చేయాలని డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, డిప్యూటేషన్‌పై పనిచేసే ఉపాధ్యాయులను రిలీవ్ అయిన ఉపాధ్యాయులను జాయిన్ చేసుకోవాలని ఆదేశించారు. ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని పర్యవేక్షించాలని కోరారు.

పారదర్శకంగా 'ఓపెన్' పరీక్షలు నిర్వహించాలి

కందనూలు: ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్ మొదలుకొని అన్ని స్థాయిల్లో పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, శ్రీధర్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పరీక్షలు వేసవి సెలవుల్లో జరుగుతున్నందున ఇన్విజిలేటర్లను మొదలుకొని అన్ని స్థాయిల నిర్వాహకులుగా కేవలం కొన్ని సంఘాలకు చెందిన వారిని, జిల్లాలో సంబంధిత సమన్వయకులుగా పనిచేస్తున్న అనుకూలమైన వారికే విధులు కేటాయిస్తున్నారని ఆక్షేపించారు. వేసవి సెలవుల్లో నిర్వహించే ఈ విధులకు సంపాదిత సెలవులు పొందే అవకాశం ఉన్నందున, సహజంగానే కొందరు ఉపాధ్యాయులు ఆశావహులుగా ఉత్సాహంగా ఉంటారని, కానీ, ప్రతిసారి అనుకూలమైన కొద్ది మందికి మాత్రమే విధులు కేటాయించడం సరికాదని, పరీక్షల నిర్వహణావసరాలకు అనుగుణంగా అందరికీ అవకాశం కల్పించాలని కోరారు. సీనియారిటీ ప్రాతిపదికన అనుసరించాలని డిమాండ్ చేశారు. అలాగే రెగ్యులర్ ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణకు కూడా ఇలాంటి అసంబద్ధ వైఖరి అవలంభిచారని, సీనియర్ గెజిటెడ్ హెచ్ఎంలు అసంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కొంతమంది సీనియర్లకు ఎలాంటి విధులు కేటాయించలేదని, గతేడాది కూడా మౌఖికంగా డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. జిల్లా ఆఫీస్‌లో ఆయా విభాగాల్లో బాధ్యతలో ఉన్నవారు ఇలాంటి పక్షపాత వైఖరిని ప్రదర్శించడం దారుణమన్నారు. ఇకపై సీనియారిటీ ప్రాతిపదికన విధులు కేటాయించేలా తగు చర్యలు తీసుకోవాలని డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు.

బీజేపీని గద్దె దింపాలి

బిజినేపల్లి: బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగబద్ధ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఇన్‌కంట్యాక్స్ విభాగాలు రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులను బనాయించడానికి ఉపయోగిస్తున్నారని, అలాంటి బీజేపీని గద్దె దింపాల్సిన సమయం వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు శుక్రవారం బిజినేపల్లిలో బీజేపీకి హటావో.. దేశ్‌కి బచావో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సీపీఐ పేరుతో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపైనా, ఆదివాసీలపైన దాడులు జరుగుతుంటే వాటిని అరికట్టడానికి బీజేపీ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. తన ఓట్ల అవసరం కోసం సమాజంలో మత ఉద్రిక్తలను పెంపొందిస్తూ విద్వేష విభజన రేఖను ఏర్పరుస్తున్నారన్నారు. ఇది దేశానికి మంచిది కాదని, గత పాలకులు ప్రజా ఉపయోగ అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను తన మిత్రులైన కార్పొరేట్ అధిపతులకు కారు చౌకగా అప్పగిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రమోళి, కృష్ణాజీ, శివశంకర్, మధుగౌడు, ప్రేమ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే లక్ష్యం చేరుతారు: వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుతం పోటీ పరీక్షలు వరుసగా నోటిఫికేషన్లు విడుదలైన నేపథ్యంలో అభ్యర్థులు క్రమశిక్షణతో చదివితే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుతారని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీలో పీయూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని, లైబ్రరీ పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అధ్యయనం, ఆలోచన, ఆచరణ, అనుభవం విద్యార్థి దశలో ప్రాథమికాంశాలన్నారు. ఆశిస్తున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు.

బీఆర్ఎస్‌లో కుదుపు..!

'కందనూలు'లో కాక

'నాగర్‌కర్నూల్'లో మారనున్న పోరు స్వరూపం

- నేతల మధ్య భగ్గుమంటున్న అసంతృప్త సెగలు
- పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ ఇదే తీరు
- మొన్న కొల్లాపూర్, నిన్న నాగర్‌కర్నూల్, తాజాగా కల్వకుర్తిలో..
- వనపర్తి, గద్వాల, అలంపూర్, అచ్చంపేటలో ఇప్పటికే తారాస్థాయికి వార్
- ఎన్నికల ఏడాదిలో రసవత్తరంగా రాజకీయం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అధికార పార్టీ భారత రాష్ట్ర సమితిలో అసంతృప్త సెగలు భగ్గుమంటున్నాయి. ప్రధానంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ముఖ్యనేతల మధ్య అంతర్గత పోరు తారస్థాయికి చేరింది. ఎన్నికలకు ఆరు నెలలు మాత్రమే ఉండడంతో ఎవరికి వారు 'దారుల' అన్వేషణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇందుకు మారుతున్న రాజకీయ పరిణామాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్‌లో సిట్టింగ్‌లకే సీట్లు అని సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో స్పష్టం చేయడంతో టికెట్ ఆశిస్తున్న వారు ప్రత్యామ్నాయ మార్గాల కోసం వేట మొదలుపెట్టినట్లు సమాచారం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కేంద్రీకృతంగా ఆధిపత్యం కొనసాగుతున్న క్రమంలో విసిగిపోయిన అసమ్మతి నాయకులు పక్క చూపులు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఫలితంగా వచ్చే ఎన్నికల నాటికి పోరు స్వరూపం మారనున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సమన్వయ లోపమే కారణమా?

ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అయితే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు భగ్గుమంటున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య సమన్వయం కుదర్చడంలో సదరు మంత్రి విఫలమయ్యారనే విమర్శలు పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈ మేరకు అధిష్టానం వెంటనే దృష్టిసారించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని పార్టీ అభిమానులు, శ్రేణులు కోరుతున్నాయి.

వనపర్తి, కొల్లాపూర్‌తోనే కీలక మలుపు..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వనపర్తిలో ఆయన సన్నిహితులు జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి తదితర నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేయడం.. ఆ తర్వాత కొల్లాపూర్‌కు చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత జూపల్లి కృష్ణారావుపై అధిష్టానం సస్పెన్షన్ వేటు వేయడం తాజా రాజకీయ పరిస్థితుల్లో కీలక మలుపునకు దారితీసినట్లు చర్చ జరుగుతోంది. తనపై వేటుకు మంత్రి నిరంజన్‌రెడ్డినే కారణమని.. ఆయన ఓటమే లక్ష్యం అని కృష్ణారావు బహిరంగంగా ప్రకటించడం హాట్‌టాపిక్‌గా మారింది. జూపల్లికి సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండగా.. పాలమూరుపై మంచి పట్టు ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయనకు అనుచరులు ఉన్నారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టిసారించిన ఆయన మెల్లమెల్లగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. వనపర్తిలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన వారితో పాటు పలు నియోజకవర్గాల్లోని ఆ పార్టీ అసమ్మతి నేతలు, సన్నిహిత ఎమ్మెల్యేలతో జూపల్లి సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోననే ఆందోళన బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొంది.

అంతటా అసమ్మతుల బెడద

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సెగ్మెంట్లు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోకి వస్తాయి. అయితే బీఆర్ఎస్‌కు సంబంధించి అన్ని నియోజకవర్గాల్లోనూ అసమ్మతుల బెడద ఉంది. అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల, ఎంపీ రాములు మధ్య వైరం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి ముదిరింది. రాములు కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీసభ్యుడు భరత్ ప్రసాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశించగా భంగపాటు ఎదురైన విషయం తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే గువ్వల కారణమని భావించిన భరత్ ఈసారి ఎమ్మెల్యే పదవికి పోటీ చేస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా అచ్చంపేటలో నిత్యం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. అదేవిధంగా నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి.. గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత.. అలంపూర్‌లో ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎంపీ మందా జగన్నాథం మధ్య అంతర్గత పోరు తారస్థాయికి చేరింది. ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు, తదితర కార్యక్రమాలతో పాటు అంతకు మునుపు పలు సందర్భాల్లో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. అదే విధంగా కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మధ్య మొదటి నుంచీ వైరం ఉండగా.. పరోక్ష విమర్శలకే పరిమితమయ్యేవారు. కానీ ఇటీవల ఇరువురు ఆత్మీయ సమ్మేళనాలు వేర్వేరుగా నిర్వహించడం.. మాజీమంత్రి చిత్తరంజన్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి కసిరెడ్డి మాత్రమే హాజరుకావడం.. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని చిత్తరంజన్‌దాస్ బహిరంగ విమర్శలు చేయడం.. ప్రతిగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధిష్టానం పట్టించుకోవాలని వ్యాఖ్యానించడం బీఆర్ఎస్‌లో కుదుపునకు సంకేతమనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది.

నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కందనూలు: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25న జరిగే నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో జరిగే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమంలో పెద్దఎత్తున యువత పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టి, ప్రజలను చైతన్యపరుస్తూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని, స్వరాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని, కేసీఆర్ స్వార్థం కోసం ఎంతో మంది యువత బలవుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, స్టేట్ బీజేపీ స్పోక్ పర్సన్ సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీపాచారి, సుబ్బారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ కొండల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అచ్చంపేట రూరల్: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లోని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలని, కూలీలు అధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని, పెండింగ్ ఆధార్ సీడింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ పర్వతాలు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు సమాయత్తం



తాడూరు శివారులో సాగు చేసిన వరిపంట

- జిల్లాలో మొదలవుతున్న వరి కోతలు
- నెలాఖరులోగా కేంద్రాల ప్రారంభానికి చర్యలు
- గత సీజన్‌లో ధాన్యం సేకరణలో తీవ్ర ఇబ్బందులు
- ప్రభుత్వ కేంద్రాలపై ఆసక్తి చూపని రైతులు

నాగర్‌కర్నూల్: జిల్లాలో ఏటా వరిసాగు గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలో అనుకున్న స్థాయిలో సాగునీరు అందుబాటులో ఉండడం, కేఎల్ఐ నీటితో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండడంతో వరిసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో గత యాసంగితో పోలిస్తే ఈసారి వరిసాగు పెరగడంతో వరిధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏప్రిల్‌లో పంట చేతికి వచ్చే సమయం కావడంతో రైతులకు మద్దతు ధర కల్పిస్తూ నెలాఖరులోగా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

నెరవేరని లక్ష్యం..

జిల్లాలో ఇటీవల వానాకాలం సీజన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపడంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెరవేరలేదు. ఇది కాక జిల్లాలో సన్న రకాలపై రైతులు ఆసక్తి చూపడం, సన్న రకాలకు ప్రభుత్వం ఇచ్చే ధర గిట్టుబాటు కాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకే ధాన్యం అమ్ముకున్నారు. 222 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3 లక్షల మె.ట., సేకరణ లక్ష్యం కాగా.. కేవలం 1.20 లక్షల మె.ట., మాత్రమే సేకరించారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అందుబాటులో లేకపోవడం, తేమ పేరిట ధరలు తగ్గించడం, ఇతరత్రా సమస్యలు ఉన్నాయని ఆరోపణలు వినిపించినా అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా సమాధానమిస్తున్నారు. రైతులు సన్నాలు పండించడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 216 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 2.27 లక్షల మె.ట., ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు.

ప్రతిపాదనలు సిద్ధం..

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో వరిసాగు గణనీయంగా పెరిగింది. గత యాసంగి సీజన్‌లో వరిని కేవలం 68,973 ఎకరాల్లోనే సాగు చేయగా.. ఈఆరి 1,55,102 ఎకరాలకు పెరిగింది. దీని ద్వారా 3.57 లక్షల మె.ట., దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. 2.27 లక్షల మె.ట., సేకరించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యం నాణ్యతను పరిశీలించిన తర్వాతే ధర నిర్ణయిస్తారు. రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, వీఆర్‌ఓ, ఏఈఓతో ధ్రువపత్రం తీసుకురావాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే.. డబ్బులు నేరుగా ఖాతాలో జమ అవుతాయి.

నెలాఖరులో ప్రారంభిస్తాం..



జిల్లాలో రైతుల నుంచి వరిధాన్యం సేకరించేందుకు 216 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. గత సీజన్‌లో సన్నరకాలను ఎక్కువగా పండించడంతో కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపలేదు. ఈసారి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తాం. నెలాఖరులోగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– మోహన్‌బాబు, డీఎస్ఓ

అందుబాటులో గన్నీ బ్యాగులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో కావాల్సిన గన్నీ బ్యాగులను అధికారులు సమకూరుస్తున్నారు. ధాన్యం సేకరణకు మొత్తం 80 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని అధికారులు అంచనా వేయగా.. ప్రస్తుతం 50 లక్షల బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో అవసరాన్ని బట్టి బ్యాగులను తెప్పించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు	అవసరమయ్యే గన్నీ బ్యాగులు	అందుబాటులో ఉన్నవి	సాగుచేసిన వరిపంట
216	81,32,742	50,43,642	1,55,102 ఎకరాలు
దిగుబడి అంచనా	**ధాన్యం సేకరణ లక్ష్యం**	**మద్దతు ధర ధాన్యం గ్రేడ్ ఏ క్వింటా**	**మద్దతు ధర ధాన్యం గ్రేడ్ బీ క్వింటా**
3.75 లక్షల మె.ట.,	2.27 లక్షల మె.ట.,	రూ.2,060	రూ.2,040

రైతు పరిశ్రమల బిల్లు తేవాలి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి వస్తువుకు కంపెనీలు ఉండటం వల్ల ఆ వస్తువులకు ధరలు నిర్ణయించుకోగలుతున్నారని ఉమ్మడి పాలమూరు రైతు ఐకమత్యం అధ్యక్షుడు పాండురంగ అన్నారు. రైతులకు కంపెనీలు లేకపోవడంతో వారి పండించిన పంటలకు ధరలు నిర్ణయించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు పరిశ్రమల బిల్లును ప్రభుత్వాలు తీసుకు వస్తే రైతులకు మేలు చేకూరుతుందని, ఆ దిశగా ఆలోచించాలని కోరారు. ఇప్పుడున్న పరిస్థితులు రైతులకు శాపంగా మారాయని, మార్కెట్ యార్డులలో రైతులకు అన్ని రకాలుగా మోసం జరుగుతుందన్నారు. కర్షకులకు అన్ని రకాలుగా తాము అండగా ఉంటామన్నారు. సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి కె.రాజు, నాయకులు బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వరి ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నాగర్‌కర్నూల్: యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని, 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కేంద్రానికి తెచ్చిన తర్వాతే తేమ శాతాన్ని చూసి టోకెన్ ఇవ్వాలని, ఏఈఓ టోకెన్ ఇచ్చిన రైతుల ధాన్యాని మాత్రమే సేకరించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని ఏ కొనుగోలు కేంద్రానికి కేటాయించిన ధాన్యం అదే మిల్లుకు అందజేయాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో 580 వస్తాలు కొనుగోలు చేసిన వెంటనే లారీ ట్రాన్స్‌పోర్ట్‌కు ఫోన్ చేస్తే లారీ పంపిస్తామన్నారు. పాత గన్నీసంచులు కాకుండా కొత్తవి ఉపయోగించాలని, దొడ్డు, సన్న రకాలు వేర్వేరుగా పంపాలని సూచించారు. డివిజన్ల వారీగా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల నంబర్లు నాగర్‌కర్నూల్ నీరజ సెల్ నం.94409 25798, 94402 05754, కొల్లాపూర్ స్వామి సెల్ నం.94407 52030, అచ్చంపేట అంజి సెల్ నం.96034 12500, కల్వకుర్తి కృష్ణయ్య సెల్ నం.95421 69069లకు ఫోన్ చేసి లారీలను తెప్పించుకోవాలని సూచించారు. అనంతరం రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ జిల్లాలో మిల్లర్లకు కేటాయించిన మాదిరిగానే వరి ధాన్యం సరఫరా చేయాలని కోరారు. అంతకు ముందు సంబంధిత శాఖల జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం బాలరాజు, డీఏఓ వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, ఐకేపీ అదనపు పీడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎస్పీ మనోహర్

అచ్చంపేట రూరల్: ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన 62 సీసీ కెమెరాల కంట్రోల్ రూంను ఎస్పీ మనోహర్‌తో కలిసి గువ్వల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి నుంచి అచ్చంపేట పోలీసుల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారులు, వ్యాపార సముదాయాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అదనంగా మరో రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఎస్పీ మనోహర్ మాట్లాడుతూ అచ్చంపేటను నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్, ఎస్ఐలు గురుస్వామి, గోవర్ధన్, శివానందంగౌడ్, శేఖర్‌గౌడ్, నాయకులు మనోహర్, నర్సింహగౌడ్ అరుణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

కందనూలు: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొరగల వారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా రాంరెడ్డి కంటి ఆస్పత్రికి పంపించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. రోగులకు జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా రక్త, సాధారణ, కరోనా పరీక్షలు జరిపిస్తారన్నారు. శిబిరానికి వచ్చే ముందు బీపీ, షుగర్, కరోనా పరీక్షల రిపోర్ట్స్, ఆధార్, ఓటర్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నం .94404 54284, 81063 33324లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

అమరచింత: బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన కటికేరి చిన్న నరసింహ (45) ప్రతి రోజు మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో కూలీ పనుల కోసం పట్టణం నుంచి వెళుతుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. రోజువారిగానే శుక్రవారం కూడా వెళ్లగా మార్గమధ్యలో కింద పడి మృతి చెందాడు. మృతునికి భార్య పారిజాతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు..

ఎర్రవల్లి చౌరస్తా: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలంలోని కోదండాపురం గ్రామానికి చెందిన నర్సింహగౌడ్(75) ద్విచక్రవాహనంపై కోదండాపురం స్టేజీకి వెళ్లి.. తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సింహగౌడ్‌ను అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై నర్సింహగౌడ్ భార్య లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంపులో పడి మరొకరు..


గట్టన్న (ఫైల్)

కొత్తకోట: మండల పరిధిలో విలియంకొండ వద్ద ఆర్‌బీవీఆర్ పాఠశాల ఆవరణంలో గట్టన్న(55) నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విలియంకొండ వద్ద ఆర్‌బీవీఆర్ పాఠశాలలో సత్యహళ్లి గ్రామానికి చెందిన గట్టన్న కొన్ని సంవత్సరాలుగా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో నీటి సంపులో పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ నాగేశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలియజేశారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ..

బల్మూర్: ఇంటి ముందున్న చెత్త విషయమై మహిళల మధ్య చెలరేగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని గట్టుతుమ్మెన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందంగౌడ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల వెంకటమ్మ, ఎల్లికంటి భీమమ్మ మధ్య ఈ నెల 19న ఉదయం బుధవారం ఇంటి ముందున్న చెత్త విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో ఆకుల కాంతయ్య(50)తోపాటు అతని భార్య వెంకటమ్మపై ఎల్లికంటి భీమమ్మ, చెన్నయ్య దాడి చేయడంతో కాంతయ్య తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతున్న కాంతయ్య గురువారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయమై కాంతయ్య భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తలనొప్పి భరించలేక వివాహిత బలవన్మరణం

చిన్నచింతకుంట: తలనొప్పి భరించలేక వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముచ్చింతలకు చెందిన పర్వీన్ (24) అదే గ్రామానికి చెందిన తెలుగు శ్రీకాంత్ 5ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే ఈమె కొంత కాలంగా తలనొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రులలో చికిత్స పొందింది. అయినా నొప్పి తగ్గకపోవడంతో గురువారం తన పుట్టింటి వద్ద బాత్రూంలో చీరతో ఉరేసుకుంది. గమనించిన తమ్ముడు మైబు తండ్రి మహ్మద్ నబీ సాబ్‌కు చెప్పాడు. వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శుక్రవారం మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నాడు.

20 గొర్రెలు మృతి

బిజినేపల్లి: మండలంలోని పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఆముదం పంటను మేసి 20 గొర్రెలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.మూడు లక్షల నష్టం వాటిల్లినట్లు కాపరి దేత్యా వివరించారు.

ఉచిత చెస్ శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 30 నుంచి ఉచిత చెస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కోచ్ ఆనంద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిగనర్స్, ఇంటర్ మీడియట్, అడ్వాన్స్ విభాగాల్లో చెస్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అండర్–15లోపు విద్యార్థులు ఈనెల 29 వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మిగతా వివరాల కోసం 99661 37908 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాహే రంజాన్.. ఈద్ ముబారక్


మహబూబ్‌నగర్‌లోని రహెమానియా ఈద్గా వద్ద ఏర్పాట్లు

- దర్శనమిచ్చిన షవ్వాల్ నెలవంక
- నేడు ఈదుల్ ఫితర్ పండుగ
- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- ముగిసిన రంజాన్ ఉపవాసాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్‌ను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి షవ్వాల్ నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలు 29 రోజులపాటు చేపట్టిన ఉపవాసాలను విరమించారు. చంద్రుడు కనిపించడంతో ముస్లింలు పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. ఈ మేరకు శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల్లో ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకొని, సర్వ మానవ కల్యాణం కోసం ప్రత్యేక నమాజు చేసి ప్రార్థనలు చేస్తారు. పేదలు, ధనికుల తేడా లేకుండా అందరు నూతన వస్త్రాలను ధరించి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకొంటారు. మహబూబ్‌నగర్‌లోని జామీయా మసీదు నుంచి ఉదయం 8.30 గంటలకు ముస్లింలు సామూహికంగా గడియారం చౌరస్తా మీదుగా స్థానిక వానగట్టు రహెమానియా ఈద్గా వద్దకు చేరుకుంటారు. ఈద్గా వద్ద ఉదయం 9.30 గంటలకు జామియా మసీదు ప్రధాన ఇమాం హాఫిజ్ మహ్మద్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు, ప్రార్థనలు చేయిస్తారు.

ఖౌమీ ఏకతా కమిటీ ఆధ్వర్యంలో..

రంజాన్ ఈద్ ముబారక్ చెప్పడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఈద్గా వద్దకు చేరుకొని పట్టణ ఖౌమీ ఏకతా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే శిబిరం వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలపనున్నారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పార్టీల నేతలు పండుగ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతారు.

నమాజుకు ఏర్పాట్లు..

ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజుకు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో ముస్లింలు వక్ఫ్ రహెమానియా ఈద్గా వద్ద రానుండటంతో ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. టెంట్లు, తాగునీటి తదితర


పాలమూరులో అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

సౌకర్యాలు కల్పించారు. మున్సిపాలిటీ సిబ్బంది వారం రోజుల నుంచి ఈద్గా వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఈద్ నమాజ్ సందర్భంగా పోలీసులు ముందస్తుగా బందోబస్తు నిర్వహించనున్నారు.

మార్కెట్లు కిటకిట..

రంజాన్ మాసంలో వ్యాపార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ముస్లింలు పగలంతా ధాన్యంలో గడుపుతారని భావించిన వ్యాపారులు రోజూ రాత్రిపూట 12 గంటల వరకు షాపులను తెరచి ఉంచారు. రంజాన్ చివరి రోజు క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, పాత గంజ్, అశోక్‌టాకీస్ చౌరస్తా, బస్టాండ్, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ తదితర ప్రాంతాల్లో ముస్లింలతో షాపులన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా వస్త్రాలు, కాస్మోటిక్ వస్తువులు, మెహందీ, మిస్వాక్, ఇత్తర్ (సుగంధ ద్రవ్యాలు), సుర్మ, ధార్మిక పుస్తకాలైన ఖురాన్, జానీమాస్‌లు, గృహ పరికరాలు, బెడ్‌షీట్లు, చెప్పులతోపాటు రంజాన్ మాసం ప్రత్యేక వంటకం షీర్‌కుర్మ తయారీ కోసం ఉపయోగించే సేమియాలు, డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేశారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే మైనార్టీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక జామియా మసీదులో రంజాన్ సందర్భంగా శుక్రవారం ఇమాం, మౌజాంలకు వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, గిఫ్ట్ ప్యాక్స్ అందజేశారు. తెలంగాణ వచ్చాకే ఇమాం మౌజాంలకు ప్రభుత్వం నెలనెల గౌరవ వేతనాలు ఇస్తుందన్నారు. షాదీముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ శాంతిభద్రతల సమస్య లేకుండా చేశామన్నారు. గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, జామియా మసీద్ అధ్యక్షుడు అహ్మద్‌సన, ప్రధాన కార్యదర్శి జకి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జుమ్మతుల్‌విదా

రంజాన్ మాసం జుమ్మతుల్‌విదా (చివరి శుక్రవారం) నమాజును జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేశారు. జిల్లాకేంద్రంతో పాటు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని ముస్లింలు జుమ్మతుల్‌విదా ప్రత్యేక నమాజుతో మసీదులు కిటకిటలాడాయి. మసీదుల్లో ఇమామ్‌లు నమాజు చేయించడంతో పాటు దువా చేశారు. పేదలను ఆదుకోవాలని, వారి కష్ట,సుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ప్రజలందరూ సుఖ శాంతులతో గడపాలని దైవాన్ని ప్రార్థించారు. మహబూబ్‌నగర్‌లోని జామియా మసీదు, మదీనా మసీదు, మక్కా మసీదు, గోల్ మసీదు, మోతీ మసీదు, మునీరీ మసీదు, రహెమానియా మసీదు, అలీమ్ మసీదు, మస్జిదే అల్ కౌసర్, షాసాబ్ గుట్ట, రైల్వే స్టేషన్ ఓమర్ ఓ ఆమేనా


జిల్లాకేంద్రంలోని జామీయ మసీద్ ఆవరణలో జుమా నమాజ్ చేస్తున్న ముస్లింలు

మసీదులతోపాటు వీరన్న పేట, పద్మావతీ కాలనీ, రామయ్య బౌలి, పాన్ చౌరస్తా, బోయపల్లి గేట్, టీడీ గుట్ట, వక్ఫ్ కాంప్లెక్స్ మైదానం తదితర ప్రాంతాల్లో ఉండే మసీదుల్లో జరిగిన సామూహిక శుక్రవారం ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమెరికా, ఇంగ్లాండ్ నుంచి ఐటీ కంపెనీలు

- కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తిచేయాలి
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


ఐటీ పార్క్ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్ తదితరులు

మహబూబ్‌నగర్ రూరల్: ఐటీ టవర్‌ను వచ్చేనెల 6న మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించుకుందామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులతో కలిసి ఐటీ టవర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది పడిన పరిస్థితి నుంచి నేడు అన్ని రంగాల్లో పురోగతి సాధించామని చెప్పారు. యువతకు స్థానికంగానే పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఐటీ కం ఎనర్జీ పార్క్‌ను చేపట్టామన్నారు. స్థానికంగా 400 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించామని, అసైన్డ్ భూములు అయినా పట్టా భూముల మాదిరిగా మెరుగైన పరిహారం అందించి రైతులకు ఇబ్బంది లేకుండా చూశామన్నారు. తక్కువ సమయంలోనే ఐటీ టవర్‌ను సిద్ధం చేసినందుకు అధికారులు, కాంట్రాక్టర్‌ను మంత్రి అభినందించారు. మే 6న ప్రారంభోత్సవం నాడు అమెరికా, ఇంగ్లాండ్‌కి చెందిన ఐటీ కంపెనీలు సైతం తమ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని వివరించారు. ఇతర దేశాల్లో స్థిరపడిన మహబూబ్‌నగర్ యువతకు కూడా ఇక్కడే మంచి వేతనాలు లభిస్తాయన్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన విదేశాల్లోని ఐటీ పరిశ్రమలకు చెందినవారు ఇక్కడ తమ వ్యాపార కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఉత్సాహంగా ఉన్నారని వివరించారు. సుమారు 20వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని వివరించారు. పేదలు ధనవంతులుగా మారేలా చేయడమే తమ ధ్యేయమన్నారు. ఐటీ టవర్ ప్రారంభం నాటికి లైటింగ్ పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణం, ప్లాంటేషన్, ఇతర మౌలిక సదుపాయాలన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కలెక్టర్‌తో కలిసి ఐటీ కారిడార్ నుంచి జాతీయ రహదారి వరకు చేపట్టే రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రవి, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

కోస్గి: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఏబీకే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని.. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరని.. రాష్ట్రంలో అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సాధించారని కొనియాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని.. ఎలాంటి అపోహలకు తావులేకుండా సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. అంతకుముందు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు జరిగిన ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమంలో


మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, మున్సిపల్ చైర్మన్ మ్యాకల శిరీష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి గందె ఓంప్రకాష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ వరప్రసాద్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, బాలేష్, బందెప్ప, జనార్దన్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట నర్సింహులు, వెంకటయ్య, బాలరాజు, వెంకటేశ్, నర్సింహులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ నరేష్‌కుమార్

టిప్పర్ డ్రైవర్ అరెస్ట్

అయిజ: రోడ్డు ప్రమాదంలో ఆటోను ఢీ కొట్టిన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం సమీపంలో మంగళవారం రాత్రి టిప్పర్‌ను అతివేగంగా నడుపుతూ.. ఆటోను ఢీకొట్టి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ ముండ్లదిన్నె పరశురాముడును అరెస్ట్ చేసి, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో నగదు, సామగ్రి దగ్ధం


గడ్డివాముకు మంటలు


చెరుకు తోటలో మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

బాలానగర్: మండలంలోని పెద్దరేవల్లిలో బుర్ర వెంకటయ్య ఇంట్లో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం జరిగి బస్తాలో దాచుకున్న రూ.50 వేల నగదు, దుస్తులు, నిత్యావసర సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. వెంటయ్య శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చారు. అప్పటికే ఇంట్లో మంటలు చెలరేగుతుండటంతో ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, విద్యుత్ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని వారు కోరారు.

మారెడుమాన్‌దిన్నెలో పశుగ్రాసం..

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారెడుమాన్‌దిన్నెలో బాలపీరమ్మకు చెందిన పశుగ్రాసానికి శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిబూడిదైంది. కొల్లాపూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేయడంతో చుట్టుపక్కల రైతుల గడ్డివాములకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. 10 ట్రాక్టర్ల వరిగడ్డి, 10 ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ తెలిపారు.

చెరుకు తోట దగ్ధం: రూ.2 లక్షల నష్టం

అమరచింత: ప్రమాదవశాత్తు చెరుకు తోటకు నిప్పంటుకోవడంతో రూ.రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణ శివారులోని పిన్నంచర్ల రహదారిలో పదెకరాల చెరుకు పంట సాగు చేయగా శుక్రవారం మధ్యాహ్నం నిప్పంటుకుందన్నారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్‌రావు సిబ్బందితో చేరుకొని ఫైరింజన్‌తో మంటలను అదుపు చేసినట్లు వివరించారు. ప్రమాదంలో ఎకరం తోట, డ్రిప్ పైపులు కాలిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది నరేష్‌గౌడ్, నాగరాజ్, భానుచందర్, మోహన్ పాల్గొన్నారు.

పనివిధానంలో నైపుణ్యం పెంచుకోవాలి

- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

స్టేషన్ మహబూబ్‌నగర్: కండక్టర్లు పని విధానంలో మరింత నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. టీఎస్ఆర్టీసీ ఏప్రిల్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కండక్టర్లకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం పాల్గొని కండక్టర్లు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడానికి కష్టపడి పనిచేయాలని సూచించారు. సంస్థకు ప్రయాణికులు ముఖ్యమని, వారి పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. సంస్థను బలోపేతం కోసం పాటుపడాలని కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కండక్టర్లకు ఎంప్లాయ్ ఎజెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈడీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎంలు సత్యనారాయణ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్లు రాంజీ, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


కండక్టర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న పురుషోత్తం

నకిలీ ధ్రువపత్రాలతో భూమి రిజిస్ట్రేషన్

- ఏకంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌నే సృష్టించిన వైనం
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన మక్తల్ తహసీల్దార్

మక్తల్: నకిలీ ధ్రువపత్రాలతో వ్యవసాయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారం మండలంలోని గుర్లపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. భూ యజమానురాలు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబంలోని కొందరు మరికొందరికి తెలియకుండా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి దాదాపు ఆరు ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో విషయం తెలుసుకున్న మిగతా కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది.

అసలేం జరిగిందంటే..

గుర్లపల్లికి చెందిన రాగుల ఆశమ్మ 01.05.2020న అనారోగ్యంతో మృతిచెందింది. ఈమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లు దేవమ్మ, మణెమ్మలకు వివాహం కాగా.. రాగుల మొగులప్ప, రాగుల లక్ష్మప్ప, రాగుల చెన్నప్ప అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో చెన్నప్ప గతేడాది హత్యకు గురికాగా.. పెద్ద కుమారుడు మొగులప్ప గత నెల 19న మృతి చెందాడు. అయితే రాగుల ఆశమ్మ మృతిచెందిన తర్వాత ఆమె పేరుపై గుర్లపల్లి శివారులో సర్వే నం.10/1లో 2.29 ఎకరాల భూమి ఉంది. అలాగే సంగంబండ శివారులో 270అ, 270ఆ, 312అ, 289ఆ, 312అ, 323ఇ/1లలో మొత్తం 3.27 ఎకరాల భూమి ఉంది. మొత్తంగా రాగుల ఆశమ్మ పేరు మీద ఉన్న 6.16 ఎకరాల భూమిని విరాసత్ చేసుకునేందుకు గాను 2022 జూన్‌లో తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు గాను రాగుల మొగులప్పతో పాటు మొత్తం ఆరుమందికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను తహసీల్దార్ కార్యాలయం జారీ చేసింది.


అసలైన సర్టిఫికెట్


నకిలీ సర్టిఫికెట్


తహసీల్దార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు

ముగ్గురి పేర్లతోనే పట్టా..

ఎఫ్ఎంసీ 022201091997 నంబర్‌తో రాగుల మొగులప్పకు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇందులో రాగుల ఆశమ్మ కూతుళ్లైన గంప మణెమ్మ, జి.దేవమ్మ, మనువళ్లు రాగుల ప్రవీణ్‌కుమార్, రాగుల రామప్ప (ఇద్దరూ రాగుల చెన్నప్ప కుమారులు), కుమారులు రాగుల లక్ష్మప్ప, రాగుల మొగులప్ప పేర్లను జత చేశారు. అయితే ఈ సర్టిఫికెట్‌ను కాకుండా భూమి రిజిస్ట్రేషన్ సమయంలో మరో నకిలీ ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ ఎఫ్ఎంసీ 022201022570 సృష్టించారు. ఇందులో రాగుల మొగులప్ప, రాగుల ప్రవీణ్‌కుమార్, రాగుల రామప్ప పేర్లతో సృష్టించి రాగుల ఆశమ్మ పేరుపై ఉన్న మొత్తం 6.16 భూమిలో రాగుల రామప్ప పేరు మీద 1.24 ఎకరాలు, రాగుల ప్రవీణ్‌కుమార్ పేరు మీద 1.25 ఎకరాలు, రాగుల మొగులప్ప పేరు మీద 3.07 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు.

బాధితులు ప్రశ్నించడంతో..

తమకు వాటా రావాల్సిన వ్యవసాయ భూమిని తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని రాగుల ఆశమ్మ కుమారుడు లక్ష్మప్ప, కూతురు దేవమ్మ తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల ప్రశ్నించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ విషయమై పూర్తి వివరాలు తెలుసుకున్న తహసీల్దార్ తిరుపతయ్య పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ సృష్టించడమే కాకుండా.. భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారానికి కారణమైన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.



సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.

మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్

చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.



రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.



వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై

మీకు తెలుసా?

వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తల నొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.

ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది. ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్



అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మల బద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?

మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...



విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ఆటకు వేళాయె



● రజనీకాంత్


● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



● సిద్ధార్థ్



● నయనతార



● మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



● అనుష్కా శర్మ

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్సెస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.



● జాన్వీ కపూర్

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్..' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్‌ఆర్ కదిర్.



● నాగచైతన్య, కృతీ శెట్టి

వీళ్లందరూ మిస్ అవలేదు..




● 'అల్లరి' నరేశ్

'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్యాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



● సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....



● రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

డాక్టర్ రేణు



● రుహానీ శర్మ

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.



● పవిత్ర, నరేశ్